## మాజీ మంత్రి హరీశ్‌రావుకు ఆహ్వానం


హరీశ్‌రావుకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు


వర్గల్, ఫిబ్రవరి 6: మండల కేంద్రంలో ఈనెల 11న నూతనంగా ప్రతిష్ఠించనున్న భ్రమరాంభిక, కేతమ్మ సమేత మల్లికార్జున స్వామి విగ్రహాల ప్రతిష్ఠకు హాజరు కావాలని కోరుతూ మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావును మండలానికి చెందిన బీఆర్‌ఎస్ జిల్లా, మండల, గ్రామస్థాయి నాయకులు గురువారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు.

## రిటైర్డ్ ఎస్సై మృతికి హరీశ్‌రావు సంతాపం


రత్నం(ఫైల్)

సిద్దిపేట, ఫిబ్రవరి 6: సిద్దిపేటకు చెందిన రిటైర్డ్ ఎస్సై రత్నం మృతికి మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే హరీశ్‌రావు మాట్లాడుతూ రత్నం తన వృత్తిని సామాజిక సేవగా భావించి పనిచేశారన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం అనేక సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకున్నారని గుర్తుచేశారు. ఆయన మృతి బాధాకరమని, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## మెనూ ప్రకారం భోజనం పెట్టాలి


స్టోర్‌రూమ్‌ను పరిశీలిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్

కొమురవెల్లి, ఫిబ్రవరి 6: విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా వంట గది, స్టోర్‌రూమ్‌తో పాటు హాస్టల్ పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలని, తేదీ దాటిన సరుకులను ఎట్టి పరిస్థితుల్లో వాడవద్దన్నారు. అనంతరం విద్యాబోధన పరిశీలించడంతో పాటు టెన్త్‌లో 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ నీరజ పాల్గొన్నారు.

## ఇంటి పన్ను చెల్లించి అభివృద్ధికి సహకరించాలి


పన్నుల వసూలులో పాల్గొన్న మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్‌గౌడ్

హుస్నాబాద్‌టౌన్, ఫిబ్రవరి 6: ఇంటిపన్ను సకాలంలో చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ గౌడ్ కోరారు. పట్టణంలోని పలు వార్డుల్లో గురువారం ఇంటిపన్ను వసూలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో అభివృద్ధి పనులు సాగాలంటే నిధులు అవసరమేనే విషయాన్ని గుర్తించాలన్నారు. పట్టణాభివృద్ధి కోసం ప్రజలు పన్ను చెల్లించి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్‌ఐ కనకరాజు, వార్డు అధికారులు సాంబరాజు, భవాని, మమత, శ్రీధర్ పాల్గొన్నారు.

## పదిలో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి


రాయపోల్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ఆర్‌జేడీ సత్యనారాయణరెడ్డి

రాయపోల్, ఫిబ్రవరి 6: టెన్త్ పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని ఆర్‌జేడీ సత్యనారాయణరెడ్డి విద్యార్థులకు సూచించారు. గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు కస్తూర్బా గాంధీ పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. విద్యార్థులకు అందుతున్న విద్యాబోధన గురించి అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్‌కు దీటుగా ప్రభు త్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యాబోధన ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి,మండల విద్యాధికారి సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

## నాణ్యమైన ఆహారం అందించాలి


ఉపాధ్యాయులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ మనుచౌదరి

కొండపాక(కుకునూరుపల్లి), ఫిబ్రవరి 6: విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని కలెక్టర్ మనుచౌదరి అధికారులకు సూచించారు. గురువారం కొండపాక మండలంలోని దుద్దెడ సోషల్ వెల్ఫేర్‌తో పాటు కొండపాకలో ఉన్న జగదేవ్‌పూర్ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్, జూనియర్ బాలికల కళాశాల, బాలికల సంక్షేమ వసతి గృహాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థుల వార్షిక పరీక్షల గురించి అడిగి తెలుసుకున్నారు. టెన్త్ పరీక్షలతో పాటు మార్చి 6 నుంచి జరిగే ఇంటర్మీడియట్ పరీక్షల్లో 100శాతం ఉత్తీర్ణత సాధించాలని విద్యార్థులకు సూచించారు. వంటగదితో పాటు స్టోర్‌రూమ్‌ను పరిశీలించిన కలెక్టర్ విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం పెట్టాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ దిలీప్‌కుమార్ పాల్గొన్నారు.

## సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలి

- డీఎంహెచ్‌వో పల్వన్‌కుమార్


డీఎంహెచ్‌వో పల్వన్‌కుమార్‌కు స్వాగతం పలుకుతున్న పీహెచ్‌సీ సిబ్బంది

జగదేవపూర్, ఫిబ్రవరి 6: సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని జిల్లా వైద్యాధికారి పల్వన్‌కుమార్ అధికారులకు సూచించారు. గురువారం జగదేవపూర్, తీగుల్ పీహెచ్‌సీలను ఆయన ఆకస్మికంగా తనిఖీకి చేశారు. ఈ సందర్భంగా దవాఖాన పరిసరాలను పరిశీలించి రోజువారీ రోగుల సంఖ్య, రక్త నమూనా సేకరణ కేంద్రం, ఫార్మసీ కేంద్రాన్ని పరిశీలించారు. రోగులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జగదేవపూర్ పీహెచ్‌సీలో ఎక్కువగా సాధారణ ప్రసవాలు చేయడంపై డాక్టర్, సిబ్బందిని అభినందించారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్, సీహెచ్‌వో రవీందర్‌రెడ్డి, శ్రీమతి, మెడకల్ ఆఫీసర్లు సత్యప్రకాశ్, రాజశేఖర్, వైద్య సిబ్బంది జితేందర్‌రెడ్డి, సురేశ్, మంగ ఉన్నారు.

### విద్యార్థులకు మెళకువలు

అక్కన్నపేట, ఫిబ్రవరి 6: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం ఎంఈవో రంగ ఆధ్వర్యంలో మండల వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో టెన్త్ చదువుతున్న విద్యార్థులకు పది పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించడంతో పాటు ఉత్తీర్ణత య్యేలా సైకాలజిస్టులు రమాదేవి, సంపత్ మెకువలు నేర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సబ్జెకుల వారీగా పలు అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం సైకాలజిస్టులను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సంధ్యారాణి, మురళీధర్, చంద్రారెడ్డి, లక్ష్మణ్, శ్రీనివాస్, వెంకటనర్సయ్య, జనార్దన్, లింగేశ్వరి, ఓంప్రకాశ్, స్వప్న పాల్గొన్నారు.

### ఆరుగురికి రిమాండ్

సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 6: మండలంలోని ఎన్సాన్‌పల్లిలో 2018లో జూదం ఆడిన కేసులో ఆరుగురిని గురువారం అరెస్ట్ చేసినట్లు త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్ తెలిపారు. ఆరుగురు కొన్ని రోజుల నుంచి కోర్టుకు రానందున న్యాయమూర్తి నాన్ బెయిలెబుల్ వారెంట్ జారీ చేశారన్నారు. ఈ మేరకు వారిని పట్టుకొని న్యాయమూర్తి ఎదుట హాజరుపర్చగా విచారణ చేసి ఆరుగురికి జ్యుడీషియల్ రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు.

### డప్పులు అందజేత

కొండపాక(కుకునూరుపల్లి), ఫిబ్రవరి 6: మందకృష్ణ మాదిగ లక్షడప్పులు వేల గొంతుల సభకు బీసీ వర్గం సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు కందూరి అయిలయ్య అన్నారు. గురువారం కుకునూరుపల్లి మండలంలోని లకుడారంలో ఎస్సీ సోదరులకు డప్పులు అందజేశారు

# హామీలు అమలుచేసే వరకు పోరాటం


సిద్దిపేట: పుల్లూరులో బీఆర్‌ఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు


సిద్దిపేట అర్బన్: బూర్గుపల్లిలో జెండా ఆవిష్కరిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు


నారాయణరావుపేట: ఇబ్రహీంపూర్‌లో జెండా ఆవిష్కరిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

- సుడా మాజీ చైర్మన్ మారెడ్డి రవీందర్ రెడ్డి

సిద్దిపేట, ఫిబ్రవరి 6: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలు అమలుచేసే వరకు బీఆర్‌ఎస్ ప్రజల పక్షాన పోరాటం చేస్తుందని సుడా మాజీ చైర్మన్ మారెడ్డి రవీందర్ రెడ్డి అన్నారు. గురువారం సిద్దిపేట రూరల్ మండలం పుల్లూరులో బీఆర్‌ఎస్ జెండాను ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఎర్ర యాదయ్య, మాజీ ఎంపీపీ చందర్‌రావు, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ ప్రభాకర్ వర్మతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే ఎలాంటి షరతులు లేకుండా అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో గ్రామ సమన్వయకర్తలు మేర సత్తయ్య, సయ్యద్, మాజీ సర్పంచ్ తిరుపతిరెడ్డి, పుల్లూరి నరేశ్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ లతావెంకట్, నాయకుడు ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

**నిధులు కేటాయించని కాంగ్రెస్**

చిన్నకోడూరు, ఫిబ్రవరి 6: సిద్దిపేట నియోజకవర్గంలో రోడ్డు, కాలువల పనులకు నిధులు కేటాయించకుండా కాంగ్రెస్ అడ్డుపడుతుందని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు, మండల సమన్వయకర్త పాల సాయిరామ్ అన్నారు. మండలంలోని విఠలాపూర్, రంగాయపల్లి గ్రామాల్లో బీఆర్‌ఎస్ ఆత్మీయ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మ, మాజీ ఎంపీపీ కూర మాణిక్యరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కాముని శ్రీనివాస్ లతో కలిసి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అభివృద్ధిని అడ్డుకుంటుందని ఆరోపించారు. రాబోయే రోజుల్లో రేవంత్‌రెడ్డికి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. స్థానిక సంస్థల్లో కాంగ్రెస్ పార్టీని చిత్తుగా ఓడించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ములకల కనకరాజు, నాయకులు జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్, రవీందర్‌రెడ్డి, కాముని ఉమేశ్, శ్రీనివాస్, గుండెల్లి వేణు, మధుసూదన్‌రెడ్డి, వైకుంఠం పాల్గొన్నారు.

**బూర్గుపల్లిలో బీఆర్‌ఎస్ జెండా పండుగ**

సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 6: మండలంలోని బూర్గుపల్లిలో బీఆర్‌ఎస్ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల నాయకులు, బీఆర్‌ఎస్ విద్యార్థి విభాగం, యువజన విభాగం, మహిళా విభాగం నాయకులతో పాటు వివిధ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

**పలు గ్రామాల్లో ..**


చిన్నకోడూరు: విఠలాపూర్‌లో మాట్లాడుతున్న పాలసాయిరామ్

నారాయణరావుపేట, ఫిబ్రవరి 6: మండలంలోని ఇబ్రహీంపూర్, బంజేరుపల్లి గ్రామాల్లో మండల ఇన్‌చార్జి, సిద్దిపేట మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ రాజనర్సు ఆధ్వర్యంలో జెండా పండుగ నిర్వహించి జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఎల్లయ్య, మాజీ ఎంపీపీ బాలకృష్ణ, బీఆర్‌ఎస్ నాయకులు ఎల్లారెడ్డి, దేవయ్య, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ మోసాలను ప్రచారం చేయాలి


పోతిరెడ్డిపల్లిలో మాట్లాడుతున్న బాలనర్సయ్య తదితరులు

చేర్యాల, ఫిబ్రవరి 6: కాంగ్రెస్ సర్కారు అమలుకు సాధ్యం కాని హామీలు ఇచ్చి రాష్ట్రంలోని అన్ని వర్గాలను నిండాముంచిందని బీఆర్‌ఎస్ క్లస్టర్ ఇన్‌చార్జిలు మేడిశెట్టి శ్రీధర్, అంకుగారి శ్రీధర్‌రెడ్డి, ముస్త్యాల బాల్‌నర్సయ్య అన్నారు. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆదేశాల మేరకు స్థానిక సంస్థల సన్నాహక సమావేశాలు మండలంలోని రాంపూర్, ఆకునూరు, పోతిరెడ్డిపల్లి, కొత్తదొమ్మాట గ్రామాల్లో గురువారం జరిగాయి. ఈ సందర్భంగా క్లస్టర్ ఇన్‌చార్జిలు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అమలు చేయని పంట రుణమాఫీ, రైతు భరోసాను గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రచారం చేస్తే విజయం తథ్యమన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు అర్హులకు తప్పక వస్తాయని అధికార కాంగ్రెస్ నాయకులు చేస్తున్న ప్రచారాన్ని ప్రజలకు తెలియపర్చాలన్నారు. 6 గ్యారెంటీలు, 420 హామీలు ఎప్పుడు అమలు చేస్తారో కాంగ్రెస్ ప్రచారం కోసం వచ్చే నాయకులను ప్రశ్నించే విధంగా ప్రజల్లో చైతన్యం తీసుకురావాల్సిన బాధ్యత గులాబీ సైనికులపై ఉందన్నారు. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ప్రజల కోసం అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి పనులను వివరించి నాటి పాలనకు నేడు కొనసాగుతున్న పరిపాలనకు తేడాలు వివరించగలిగితే విజయం మనదేనన్నారు. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి చేర్యాల రెవెన్యూ డివిజన్ సాధించేందుకు అసెంబ్లీలో మాట్లాడిన అంశంతో పాటు సీఎం, మంత్రులను కలిసి డివిజన్ ఏర్పాటు అంశాన్ని ప్రజలకు తెలియజేయాలన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు ఏఎంసీ మాజీ చైర్మన్ సుంకరి మల్లేశం, మాజీ ఎంపీపీ వుల్లంపల్లి కరుణాకర్, మంగోలు చంటి, శివగారి అంజయ్య, పచ్చిమడ్ల సతీశ్, మంచాల కొండయ్య, పచ్చిమడ్ల మానస, తాడెం రంజితాకృష్ణమూర్తి, పచ్చిమడ్ల సిద్ధిరాములు, బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జింకల పర్వతాలుయాదవ్, గ్రామశాఖల అధ్యక్షులు పాల బాలరాజు, గర్నెపల్లి చంద్రం తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలి


మద్దూరు: నర్సాయపల్లిలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

మద్దూరు(ధూళిమిట్ట), ఫిబ్రవరి 6: మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్‌కు స్థానిక సంస్థల ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని మద్దూరు మాజీ ఎంపీపీ బద్దిపడిగె కృష్ణారెడ్డి అన్నారు. గురువారం మద్దూరు మండలంలోని నర్సాయపల్లిలో ఎన్నికల సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హామీల అమలులో కాంగ్రెస్ పూర్తిగా విఫలమైందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జిలు ముస్త్యాల నాగేశ్వర్‌రావు, ఇన్నారెడ్డి, బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు తవిటి యాదగిరి, నాయకులు మంతెన బాల్‌రెడ్డి, తవిటి రాములు, గోలిపల్లి నర్సిరెడ్డి, ముస్త్యాల శ్రీనివాస్, చల్లా మహేందర్‌రెడ్డి, మంతెన భరత్ పాల్గొన్నారు.

**ధూళిమిట్ట మండలంలో..**

ధూళిమిట్ట మండల కేంద్రంతో పాటు కొండాపూర్‌లో బీఆర్‌ఎస్ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ ధూళిమిట్ట మండల అధ్యక్షుడు మంద యాదగిరి మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అత్యధిక స్థానాల్లో గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జిలు అంకుగారి శ్రీధర్‌రెడ్డి, తాడెం రంజితాకృష్ణమూర్తి, పచ్చిమడ్ల సిద్ధిరాములు, మాజీ జడ్పీటీసీ నాచగోని పద్మావెంకట్‌గౌడ్, బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు స్వర్గం లక్ష్మయ్య, నాయకులు చొప్పరి సాగర్, మాజీ సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.


ధూళిమిట్టలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

## మందకృష్ణను కలిసిన ఎమ్మార్పీఎస్ నాయకులు

హుస్నాబాద్ టౌన్, ఫిబ్రవరి 6: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగను హుస్నాబాద్‌కు చెందిన పలువురు నాయకులు గురువారం కలిశారు. ఈ సందర్భంగా ఆయన్ను హైదరాబాద్‌లో సన్మానించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సాయన్న, సాం స్కృతిక ప్రదర్శన రాష్ట్ర కోఆర్డినేటర్ సంపత్‌కుమార్, నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జి మాట్ల వెంకటస్వామి, మండల అధ్యక్షుడు కొలుగూరి అశోక్ పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

రాయపోల్, ఫిబ్రవరి 6: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని రాయపోల్ ఎస్సై విక్కుర్తి రఘుపతి సూచించారు. బుధవారం రాత్రి మండలంలోని అనాజీపూర్‌లో కనువిప్పు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకు ఓటీపీ నంబర్లు చెప్పవద్దన్నారు. నూతన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. వాహనాలు నడిపేటప్పుడు రోడ్డు నిబధనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్సై రాజు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### మురుగు..పరుగు


చాంబర్ ద్వారా పైకి వస్తున్న మురుగు

గజ్వేల్, ఫిబ్రవరి 6: పట్టణంలోని 14వ వార్డు ఎయిర్‌టెల్ టవర్ కాలనీలో యూజీడీ చాంబర్లు నిండి నాలుగు రోజులుగా మురుగుపైకి వస్తుండడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. చాంబర్ల నుంచి మురుగు పైకి వచ్చి రోడ్లపైకి చేరడంతో నడవలేని పరిస్థితి ఉన్నది. అధికారులకు చెప్పినా పట్టించుకోవడంలేదని కాలనీ వాసులు వాపోతున్నారు. గతంలో ఇదే పరిస్థితి వస్తే అధికారుల దృష్టికి తీసుకువెళ్తే చాంబర్లను శుభ్రం చేయించడంతో సమస్య తీరింది. కానీ సమస్య కొద్ది రోజులుగా తరచూ రావడంతో కాలనీ వాసులు ఇబ్బంది పడుతున్నారు.

## వీఆర్‌ఏల వారసులకు ఉద్యోగాలివ్వాలి


నిరసన వ్యక్తం చేస్తున్న వీఆర్‌ఏలు

చేర్యాల, ఫిబ్రవరి 6: వీఆర్‌ఏల వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని వీఆర్‌ఏ జేఏసీ నాయకులు అన్నారు. గురువారం చేర్యాల పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ప్రభుత్వ వైఖరిపై నల్ల బ్యాడ్జీలతో వీఆర్‌ఏలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2022లో 80 రోజుల సమ్మె పోరాట ఫలితాన్ని గుర్తించిన నాటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం జీవో నెంబర్ 81, 85లను విడుదల చేసిందన్నారు. ఆ జీవో ప్రకారం రాష్ట్రంలో ఉన్న 20,555 మంది వీఆర్‌ఏల్లో 16,758 మందికి ఉద్యోగోన్నలు ఇచ్చి ఇతర శాఖల్లో సర్దుబాటు చేశారన్నారు. ఆ జీవో ప్రకారం 3797 మంది వీఆర్‌ఏ వారసులకు ఉద్యోగాలు ఇస్తామన్నారని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 14 నెలలు గడుస్తున్నా నేటికీ వీఆర్‌ఏ వారసులకు ఉద్యోగాలు ఇవ్వకుండా కాలయాపన చేస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో బొల్లె మల్లేశం, సత్తాల మహేశ్, సనాది ప్రవీణ్‌కుమార్, జక్కుల పరశురాములు, అరిగే సత్తయ్య పాల్గొన్నారు.

## రోడ్ల నిర్మాణానికి రూ.44.38కోట్లు మంజూరు

హుస్నాబాద్, ఫిబ్రవరి 6: హుస్నాబాద్ నియోకవర్గంలోని పలు మండలాల్లో బీటీ, సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం, పలు రోడ్ల రెన్యువల్ పనుల కోసం రూ.44.38కోట్ల నిధులు మంజూరైనట్లు రవాణా, బీసీ సంక్షేమశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ గురువారం పత్రికలకు విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ఎస్‌డీఎఫ్ నిధుల నుంచి బీటీ రోడ్ల నిర్మాణానికి అక్కన్నపేట మండలానికి రూ.4.35కోట్లు, భీమదేవరపల్లికి రూ. 6కోట్లు, కోహెడకు రూ.1.95కోట్లు, సైదాపూర్‌కు రూ.2.70కోట్లు మొత్తం రూ.15కోట్లు వచ్చాయన్నారు. సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి సైదాపూర్ మండలానికి రూ.2కోట్లు, చిగురుమామిడికి రూ.1.80కోట్లు, హుస్నాబాద్‌కు రూ.1.05కోట్లు, అక్కన్నపేటకు రూ. 2.09కోట్లు, ఎల్కతుర్తి, భీమదేవరపల్లికి రూ. 1.40కోట్ల చొప్పున మొత్తం రూ. 11.49 కోట్ల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. బీటీ రెన్యువల్ పనుల కోసం సైదాపూర్ మండలానికి రూ.5.20కోట్లు, హుస్నాబాద్‌కు రూ.1.62కోట్లు, కోహెడకు రూ. 1.96 కోట్లు, అక్కన్నపేట మండలానికి రూ. 9.10 కోట్లు మంజూరైనట్లు మంత్రి చెప్పారు. నిధులు మంజూరు చేసిన పంచాయతీరాజ్, ఆర్ అండ్‌బీ మంత్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

## 9న శతసహస్ర సూర్య నమస్కారాల ప్రదర్శన


మాట్లాడుతున్న నిర్వాహకులు

సిద్దిపేట, ఫిబ్రవరి 6: సిద్దిపేట ప్రభుత్వ బాలికల పాఠశాల మినీ స్టేడియంలో ఈనెల 9న ఉదయం 6 గంటలకు శతసహస్ర సూర్య నమస్కారాల ప్రదర్శన ఉంటుందని వ్యాస మహర్షి యోగా సొసైటీ, జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్, భారతీయ స్వాభిమాన్ ట్రస్టు ప్రతినిధులు తోట అశోక్, నిమ్మ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. సిద్దిపేటలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఆసక్తిగలవారు రిజిస్ట్రేషన్ చేసుకుని సూర్యనమస్కారాలు చేయవచ్చన్నారు. 25 ఏండ్లలోపు, 25 ఏండ్లపైన వారికి వేర్వేరుగా రాష్ట్రస్థాయి సూర్య నమస్కారాల పోటీలు జరుగుతాయన్నారు. విక్రమ్‌రెడ్డి, చిప్ప ప్రభాకర్, స్వామి, అయిత అంజయ్య, రాములు, హరిప్రసాద్, బసవ రాజ్‌కుమార్, కళ్లపల్లి శ్రీనివాస్, కరుణాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి , శ్రీనివాస్, యోగా శిక్షకుడు తోట సతీశ్ పాల్గొన్నారు.


### జాతీయస్థాయిలో రాణించాలి

కొమురవెల్లి, ఫిబ్రవరి 6: గ్రామీణ క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించాలని బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు, బీఆర్‌ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బొంగు రాజేందర్‌రెడ్డి అన్నారు. ఇటీవల జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకొని కొమురవెల్లిలో బీఆర్‌ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌లో గెలిచిన జట్టు క్రీడాకారులకు గురువారం ఆయన స్పోర్ట్స్ టీషర్ట్స్ అందజేశారు. కార్యక్రమంలో రసూలాబాద్ మాజీ సర్పంచ్ పచ్చిమడ్ల స్వామిగౌడ్, ఐనాపూర్ మాజీ ఎంపీటీసీ మెరుగు కృష్ణాగౌడ్, బీఆర్‌ఎస్ మండల యూత్ అధ్యక్షుడు బూర్గు స్వామి గౌడ్, కృష్ణ, క్రీడాకారులు పాల్గొన్నారు.

### రసవత్తరంగా ఎన్నికలు

సిద్దిపేట టౌన్,ఫిబ్రవరి 6 : సిద్దిపేట గీత పారిశ్రామిక సహకార సంఘం ఎన్నికలు గురువారం రసవత్తరంగా సాగాయి. తొమ్మిది డైరెక్టర్ స్థానాలకు 24 మంది పోటీ పడ్డారు. సంఘంలో 331 ఓట్లు ఉండగా 318 ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 20 ఓట్లు చెల్లనవిగా అధికారులు నిర్ధారించారు.లాల్‌బహుదూర్ 231 ఓట్లతో మొదటి స్థానంలో నిలువగా పల్లె సునిల్ గౌడ్,గ్యాదగోని కిష్టయ్య,శ్రీనివాస్,పల్లె బాలకిషన్,గ్యాదగోని సత్యంగౌడ్,ప్రకాశ్‌గౌడ్, మహిళా విభాగంలో పల్లె భారతి అత్యధిక ఓట్లు సాధించగా బాలగోని బుచ్చవ్వ గెలుపొందారు.శుక్రవారం గీతపారిశ్రామిక సహకారం సంఘం చైర్మన్‌ను ఎన్నుకుంటారు.ఎన్నికల అధికారులుగా రఘోత్తంరెడ్డి,శ్రీనివాస్‌రెడ్డి, గౌతమ్ వ్యవహరించారు.గెలుపొందిన విజేతలు సంబురాలు జరుపుకొన్నారు.

## మహిళా రక్షణ చట్టాలపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న సీఐ శ్రీను

చేర్యాల, ఫిబ్రవరి 6: చేర్యాలలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో విద్యార్థులకు మహిళా రక్షణ చట్టాలపై గురువారం చేర్యాల సీఐ శ్రీను అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన షీటీమ్, దాని ప్రా ముఖ్యత, సైబర్ నేరాలు, పోక్సో చట్టం, బాల్యవివాహాల వల్ల జరిగే పరిణామాలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి వివరించారు. రోడ్లపై, ఇతర ప్రదేశాల్లో ఎవరైనా వేధించినా, అవహేళనగా మాట్లాడినా 8712667434 నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. స్కూల్ ప్రిన్సిపాల్ కృష్ణవేణి, మహిళా ఉపాధ్యాయులు, హుస్నాబాద్ షీటీమ్ సభ్యుడు సదయ్య, కానిస్టేబుల్ ప్రశాంతి, కృష్ణ పాల్గొన్నారు.

## ఓపెన్ ప్లాట్ల హద్దులు చూపించాలి

గజ్వేల్, ఫిబ్రవరి 6: ఓపెన్ ప్లాట్లకు సంబంధించిన హద్దులు ఎప్పుడు చూపిస్తారంటూ మల్లన్నసాగర్ ప్రాజెక్టు నిర్మాణంలో ముంపునకు గురైన తొగుట మండలం వేములఘాట్ గ్రామస్తులు తహసీల్దార్‌ను ప్రశ్నించారు. గురువారం ఓపెన్ ప్లాట్లు తీసుకున్న గ్రామస్తులు తహసీల్దార్ కార్యాలయానికి చేరుకొని తమకు ప్లాట్లకు సంబంధించి రిజిస్ట్రేషన్ చేసి సంవత్సరం గడుస్తున్నా హద్దులు చూపించడంలో అధికారులు చొరవ తీసుకోవడం లేదని, దీంతో తమకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. రిజిస్ట్రేషన్ చేసిన ప్లాట్ల హద్దులు త్వరగా చూపించి తమకు న్యాయం చేయాలని కోరారు.

### ఆర్థికసాయం అందజేత

వర్గల్, ఫిబ్రవరి 6: మండలంలోని వేలూర్ గ్రామానికి చెందిన మహంకాళి ఆగమ్మ కూతురుకు శ్రీనూతన గౌడ సంఘం రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్, బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు గుండుకాడి వెంకటేశంగౌడ్ చీర, పుస్తెమట్టెలు, నగదు అందజేశారు. నాయకుడు మల్లేశ్‌యాదవ్ పాల్గొన్నారు.

### తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి

మద్దూరు(ధూళిమిట్ట), ఫిబ్రవరి 6: గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని మిషన్ భగీరథ డీఈఈ కృష్ణ అన్నారు. గురువారం మద్దూరు మండలంలోని వల్లంపట్లలో సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా గ్రామాన్ని మిషన్ భగీరథ అధికారులు సందర్శించి, గ్రామంలో అందుబాటులో ఉన్న నీటి వనరులు, మిషన్ భగీరథ సరఫరాను పరిశీలించారు. ఏఈఈ ప్రవళిక, పంచాయతీ కార్యదర్శి కిరణ్‌కుమార్‌గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

### నేటి బాలలే రేపటి పౌరులు

సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి 6: నేటి బాలలే రేపటి భావిభారత పౌరులని జడ్జి స్వాతిరెడ్డి అన్నారు. సిద్దిపేట బాలసదనంలో గురువారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఏ సమస్య ఉన్నా.. సహాయం కావాలన్నా జిల్లా లీగల్ సర్వీసెస్ ఆథారిటీని సంప్రదించాలని సూచించారు. అర్హులైనవారికి ఉచిత న్యాయ సహాయం అందిస్తామన్నారు.మమత, బాలల సంరక్షణ అధికారి రాము పాల్గొన్నారు.

### ఇష్టపడి విద్యను అభ్యసించాలి

మిరుదొడ్డి (అక్బర్‌పేట–భూంపల్లి), ఫిబ్రవరి 6: విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి విద్యను అభ్యసించి భవిష్యత్‌కు బంగారు బాటలు వేసుకోవాలని అక్బర్‌పేట–భూంపల్లి మండల ఎంఈవో అంజాగౌడ్ కోరారు. గురువారం అక్బర్‌పేట–భూంపల్లి మండలంలోని భూంపల్లి జడ్పీ పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు ప్రత్యేక తరగతులు తీసుకొని పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### తాగునీటి సమస్య పరిష్కరించాలి

గజ్వేల్, ఫిబ్రవరి 6: వేసవిలో తాగునీటి సమస్య పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య కోరారు. గురువారం ఆయన మాట్లాడుతూ రెండు నెలలుగా మిషన్ భగీరథ నీటిని సరిపడా వదలక ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. మర్కూక్ మండలంలోని దామరకుంట, కాశీరెడ్డిపల్లి, వరదరాజపూర్, కర్కపట్ల, జగదేవ్‌పూర్ మండలంలోని ఇటిక్యాల, కొత్తపల్లి, చాట్లపల్లి, వట్టిపల్లి, పలుగుగడ్డ, మందాపూర్, కొండాపూర్‌లలో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలని కోరారు.

### క్రికెట్ క్లబ్ కార్యవర్గం ఎన్నిక

గజ్వేల్, ఫిబ్రవరి 6: గజ్వేల్ నియోజకవర్గ క్రికెట్ క్లబ్ అధ్యక్షుడిగా జక్కుల విజయ్‌కుమార్, ఉపాధ్యక్షులుగా లతీఫ్‌ఖాన్, సంతోష్, సభ్యులుగా శ్రీనివాస్, జుబేర్, మజ్జు, జహీర్‌ఖాన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు విజయ్‌కుమార్ మాట్లాడుతూ గజ్వేల్ వేదికగా క్రికెట్ పోటీలు నిర్వహించి ప్రతిభ గల క్రీడాకారులను ప్రోత్సహిస్తామన్నారు.

### క్షీరసాగర్‌లో సెమినార్

ములుగు, ఫిబ్రవరి 6: మండలంలోని క్షీరసాగర్ గ్రామంలోని హంస హోమియోపతి మెడికల్ కళాశాలలో గురువారం మెడికల్ సాఫ్ట్‌వేర్ హోమియోపతిపై సెమినార్ నిర్వహించారు. వైద్య విధానంలో మెలకువలు, నూతన పరిశోధనలు, సముద్ర జీవుల నుంచి కొత్త ఔషధాల సమగ్ర సమాచారం, విషయ పరిజ్ఞానంపై సెమినార్‌లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హంస హోమియోపతి మెడికల్ కళాశాల డైరెక్టర్ ఉమేశ్, ప్రిన్సిపాల్ నూరుస్ సహెరఖాన్, సూపరింటెండెంట్ శ్రీనివాస్‌బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

### ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

హుస్నాబాద్, ఫిబ్రవరి 6: హుస్నాబాద్ పట్టణంలోని నాగారం రోడ్డు, అక్కన్నపేట రోడ్లలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నందున స్థానిక పోలీసులు, మున్సిపల్ అధికారులు నడుం బిగించారు. గురువారం మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్‌గౌడ్, ఎస్సై తోట మహేశ్ ఆధ్వర్యంలో మున్సిపల్, పోలీసు సిబ్బంది రెండు రోడ్లలోని దుకాణాల ఎదుట రోడ్లపై పెట్టిన నేమ్‌బోర్డులు, నాలుగు చక్రాల బండ్లు, బైక్‌లను తొలిగించారు. రోడ్లపై పార్క్ చేసిన బండ్లకు జరిమానా విధించారు. అనంతరం దుకాణాదారులు, వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు భద్రత అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మహేశ్, కమిషనర్ మల్లికార్జున్‌గౌడ్ మాట్లాడారు.

### న్యాయవాదుల నిరసన

హుస్నాబాద్, ఫిబ్రవరి 6: హుస్నాబాద్ మున్సిఫ్‌కోర్టులో న్యాయవాదులు విధులను బహిష్కరించి కోర్టు ఎదుట గురువారం నిరసన వ్యక్తం చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మురళీమోహన్, ఉపాధ్యక్షుడు కన్నోజు రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి జుమ్లానాయక్, న్యాయవాదులు యాళ్ల శ్రీనివాస్‌రెడ్డి, బాలకిషన్, చిత్తారి హన్మయ్య, జె రవీందర్, జే కిరణ్, ప్రవీణ్, రఘువీర్, రాజశేఖర్, సూర్యప్రకాశ్‌రెడ్డి, సంపత్, శ్రీదేవి, తేజ్, స్వాతి, విశ్వ, అజయ్, పరశురామ్ పాల్గొన్నారు.